# శ్రీకాంతశర్మ

# గుర్నాథాలున్నారు.. జాగ్రత్త!

మీకెప్పుడైనా గుర్నాథం లాంటి వ్యక్తి తారసపడ్డాడా?

లేదనుకుంటాను. అయినా ఎప్పుడైనా తారసపడొచ్చు. ఉండండి.

గుర్నాథం చేసేది బడిపంతులు ఉద్యోగం. కానీ మొత్తం ప్రభుత్వ శాఖలన్నీ తన చెప్పుచేతుల్లో నడుస్తున్నట్టు మాట్లాడుతాడు. తనకు చిన్న ఆఫీసర్ల నుంచీ పెద్ద ఆఫీసర్ల దాకా అందరూ పరిచయమనీ, వాళ్ళు తన నోటంట వచ్చిన మాటకు కొండంత విలువనిచ్చి గౌరవిస్తారనీ అందరి ముందూ ప్రగల్భాలు పలుకుతుంటాడు. అంతే కాదు- ఎదుటి మనిషి సుఖంగా వున్నాడంటే కుళ్ళుకోవడం; కష్టాల్లో ఉన్నాడంటే సంతోషించడం అతని ప్రత్యేకత. ఆ కష్టాల్లో ఉన్నవాళ్ళు అడక్కపోయినా తన గొప్పను చాటుకోవడం కోసం బోలెడంత సానుభూతి చూపించి చిన్న సహాయం చెయ్యడానికి సిద్ధపడడం; ఆ తరువాత దాన్నే కొండంతలు చేసి ఇతరుల ముందు చెప్పుకుని మురిసిపోవడం అతని స్వభావం.

గుర్నాథం బడిపంతులని ముందే చెప్పాను కదా- తన క్లాసు పిల్లలను తిట్టడం, కొట్టడం అతని అభ్యాసం. ఆ అభ్యాసంతోనే వాళ్ళు తప్పు చేయకపోయినా దండించి వాళ్ళు ఏడుస్తుంటే చూసి ఆనందించటం అతని స్వభావం. అంతేకాదు; ఏ కుర్రాడయినా కాస్త 'ఉన్నింటి బిడ్డ' అని తెలుస్తే చాలు- వాడెంత బాగా చదివినా- మంత్లీ టెస్టులో తక్కువ మార్కులు వేసి, ఆ తరువాత నయానో భయానో వాళ్ళ దగ్గరే ప్రైవేటు కుదుర్చుకుని నాలుగు డబ్బులు సంపాదించడం అతని ప్రత్యేకత అలా చేయబట్టే ఆరుగురు పిల్లలున్న తన సంసారాన్ని సజావుగా నడుపుకొస్తున్నాడు.



ఎదుటివాడిని కించపరిచి తన ఆధిక్యతను చాటుకోవడమంటే గుర్నాథానికి బలే సరదా. అందుకే ఆరోజూ అలాగే చేశాడు.

క్లాసులోకి కొత్తగా చేరిన హేమ అనే అమ్మాయి కాస్త 'కలవారింటి బిడ్డలాగా' కనిపించడంతో ఆమెకు మార్కులు తక్కువ వేయడమే కాకుండా ఆమెను క్లాసులో నిలబెట్టి, నానా మాటలతో తిట్టి పిల్లలందరి ముందూ అవమానించాడు. క్లాసు పిల్లలందరూ నవ్వుతుంటే హేమకు సిగ్గుతో ప్రాణం పోయినంత పనయింది. తలను పూర్తిగా కిందికి దించేసుకుని మౌనంగా కన్నీరు కార్చసాగింది.

అది చూసి లోలోపలే ఆనందించిన గుర్నాథం "మరీ అంతగా ఏడవక్కర్లేదులే. అన్ని సబ్జెక్టుల్లోనూ బాగా చదివి, క్లాసు టీచర్నయిన నా సబ్జెక్టులోనే నువ్వింత పూర్‌గా ఉన్నావంటే నాకెంత అవమానమో ఆలోచించావా? ఊఁ...ఇందు.... ఈ కాగితం పట్టుకెళ్ళి మీవాళ్ళకివ్వు" అని చెప్పి మడిచి వున్న కాగితాన్ని ఆమె చేతికిచ్చాడు.

"మీ అమ్మాయి చదువులో చాలా పూర్‌గా ఉంది. ఈ విషయం మాట్లాడటానికి వెంటనే నా దగ్గరికీ రండి."

ఇది ఆ కాగితంలో ఉన్న సారాంశం.

ఇలాంటి కాగితం ముక్కను ఎవరికైనా రాసి పంపిన రోజు గుర్నాథానికి పెద్ద పండగ రోజు. పరమాన్నం తిన్నంత ఆనందంగా వుంటుంది....

ఆ రోజు అంత ఆనందంగా ఉన్నాడు కాబట్టే కొంత ఖర్చవుతుందన్న సంగతి కూడా మర్చిపోయి ఓ కాఫీ హోటల్లో దూరాడు గుర్నాథం. అక్కడ ఖాళీగా ఉన్న ఓ కుర్చీలో కూర్చుని తీరిగ్గా సిగరెట్టు వెలిగించి- అప్పుడే తన ఊహల్లో హేమ తల్లిదండ్రులు తనను వచ్చి కలుసుకున్నట్టూ, కూతుర్ని ఎలాగైనా గట్టెక్కించమని ప్రాధేయపడుతున్నట్టూ- తాను వాళ్ళనేదో ఉద్ధరిస్తున్నట్టు పోజు పెట్టి - హేమకు రాని ఆ సబ్జక్టు నేను చెబుతాలెండి.... నా దగ్గర ట్యూషను చెప్పించుకుంటే ఎంతటి మొద్దు పిల్లలైనా క్లాసులో ఫస్టు రావలసిందే!" అని వాళ్ళకు అభయం ఇచ్చినట్టూ- కళ్ళు మూసుకుని కలలు కనసాగాడు...

మంచినీళ్ళ గ్లాసును బల్ల మీద టక్కున చప్పుడయ్యేలా పెట్టి "ఏం కావాలండీ...?" అని సర్వరు అడిగినప్పుడు గానీ గుర్నాథం వాస్తవంలోకి వచ్చిన తరువాత తను కూర్చున్నది హోటల్ అని గ్రహించి ఓ ప్లేటు పకోడీలకు ఆర్డరిచ్చాడు.

అవి రాగానే ఆలోచనలు కట్టిపెట్టి వాటిని తినడంలో మునిగిపోయాడు.

సరిగ్గా అప్పుడే హోటల్లోకి అడుగుపెట్టిన చలపతి అక్కడ గుర్నాథాన్ని చూసి బోలెడు సంతోషపడిపోయాడు. గబగబా వచ్చి అతని పక్కన కూర్చున్నాడు.

ఓసారి తలెత్తి అతనికేసి చూసిన గుర్నాథం "ఏడిప్పుడు ఇక్కడెందుకు దాపురించినట్టు?" అని మనసులో అనుకుంటూ వుండగానే చలపతి గుర్నాథం భుజం మీద గట్టిగా చరిచి- "సీకి

సంగతి తెలుసుటోయ్ గుర్నాథం?" అని అడిగాడు.

"ఏ సంగతి?" అని విసుగ్గా అడిగిన గుర్నాథం, చలపతి చెప్పిన మాట వింటూనే అవాక్కయిపోయి అలా కూర్చుండిపోయాడు. అతని చేతిలోని పకోడి ముక్క నోట్లోకి వెళ్ళకుండా సగంలోనే ఆగిపోయింది.

"నువ్వు చెప్పింది నిజమేనా?" అని అడిగాడు గుర్నాధం చలపతిని.

అతనికి నమ్మకం కలిగించడానికా అన్నట్టు చలపతి అతని వీపు మీద గట్టిగా చరిచి "నీమీదొట్టు. సుందరరావు ఉద్యోగం కాస్తా పుటుక్కున ఊడిందట!" అన్నాడు.

"ఊడిందా లేక అతనే మానేశాడా?" అప్పటికీ సందేహం తీరక అడిగాడు గుర్నాథం.

అతనైతే 'నేనే ఉద్యోగం మానేశాన'ని అందరితోనూ చెప్పుకుంటున్నాడట! మరేమని చెప్పుకుంటాడు పాపం!"

"ఎందుకని మానేశాట్ట?"

"ఆ ఉద్యోగం చేయడం అతనికి బోర్‌గా వుందిట!"

గుర్నాథం గట్టిగా నవ్వాడు. "అలా కాక ఇంకెలా చెప్పుకుంటాడులే పాపం! అయినా అసలు సంగతేమిటో రేపీపాటికి నేను కనుక్కోనూ?" అన్నాడు ధీమాగా.

చలపతికి ఆ మాట కొండంత ఊరటనిచ్చింది. "హమ్మయ్య.... అయితే అసలు సంగతేమిటో నువ్వు కనుక్కుంటావన్న మాట! ఇప్పుడు నా మనసు కుదుటపడింది చూడు" అన్నాడు గుండె మీద చెయ్యేసుకుని.


గుర్నాధానికి ఆ విషయం విని ఎంత సంతోషమయిందంటే.. పకోడీలు పూర్తిగా తినకుండానే అతని కడుపు నిండిపోయింది. అతని మనసంతా సుందర్రావే ఆక్రమించేశాడు. అందుకే అతని గురించి అనర్గళంగా చెప్పుకుపోయాడు :- "అసలు వాడు చిన్నప్పట్నుంచీ అంతే చలపతీ.... నువ్వంటే ఈ మధ్య ఫ్రెండయ్యావు కానీ నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. ప్రతీ దానికీ తొందరపాటే వాడికి. ఏ పని చేసినా నిదానంగా పకడ్బందీగా చేద్దామన్న ఆలోచనే లేదు.... ఇప్పుడూ ఆ తొందరపాటుతోనే ఉద్యోగం మానేసివుంటాడు..."

చలపతి మధ్యలోనే కల్పించుకుని "ఉద్యోగం అతనే మానేశాడంటావా? లేక అతన్నే ఉద్యోగం నుంచి తీసేశారా?" అన్నాడు.

"ఏదయితేనేం మొత్తానికి ఉద్యోగం పోయింది."

"అయినా సుందర్రావుకి ఉద్యోగం దొరకడం మరింత కష్టం కాదనుకుంటా!" అన్నాడు చలపతి.

గుర్నాథం మొహం అసహనంగా మారిపోయింది. అయినా దాన్ని కప్పెట్టుకుంటూ అదోలా నవ్వేశాడు: "దొరికితే మంచిదేగా! ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే బాధ కలుగుతుంది గానీ సుఖంగా ఉన్నారంటే మనకూ సంతోషమేగా! కానీ ఇప్పుడే వేరే కొత్త ఉద్యోగం దొరికిందే అనుకో.... మరి 'ఇదివరకెక్కడ పని





చేశారు? ఆ ఉద్యోగం ఎందుకు మానేశారు?' అని అడగరూ అయినా నలభయ్యో పడిలో పడిన వాడికి ఉద్యోగం దొరకడం నువ్వనుకున్నంత సులభం కాదు...."

చలపతి గుర్నాథం మాటలు వినిపించుకోకుండా తన ధోరణిలోనే ఉన్నాడు ఇంకా.- ఏమో బాబూ సుందర్రావును చూస్తే అతనేం ఇబ్బందుల్లో వున్నట్టు అనిపించడం లేదు. అద్దెదయినా పెద్ద ఇల్లు, ఫర్నీచరు.... ఎందులోనూ లోటు లేదు. అన్నీ హైక్లాస్" అన్నాడు.

గుర్నాథం తేలిగ్గా చప్పరించేశాడు: "ఆఁ.... ఆ దర్జాలన్నీ ఇంకెన్నాళ్ళులే! చేతిలో డబ్బు ఆడకపోతే దర్జాలన్నీ ఆగిపోతాయి. అయినా ఇన్నాళ్లూ వాడికి డబ్బు విలువ తెలిస్తేగా? పెళ్ళాన్ని బాగా నెత్తికెక్కించుకున్నాడు. ఆవిడగారేమో ఇంటి ముందు ఆటో రాందే కాలు బయట పెట్టదాయె...." అని చెప్పుకుపోతూ మధ్యగా చటుక్కున ఆలోచన రాగా "ఆఁ... వాడు మరీ అంత ఇబ్బందేమీ పడక్కర్లేదులే! ఎందుకంటే నాలాంటిమిత్రుడు ఉండీ కూడా చూస్తూ ఊరుకుంటానా? ఏ వందో, రెండొందలో వాడు అడిగినప్పుడల్లా సర్దనూ? స్నేహితుడన్న తరువాత ఆ మాత్రం సహాయం చేయకపోతే ఎలా చెప్పు?" అన్నాడు.

ఈ మాట అంటున్నప్పుడు అతని మనసులో ఓ చక్కటి ఊహా చిత్రం రూపుదిద్దుకోసాగింది....

...తన ఇంట్లో తను దర్జాగా వాలుకుర్చీలో వాలి, హాయిగా సిగరెట్టు కాల్చుకుంటున్నాడు....

అప్పుడు సుందర్రావు మొహం వేళ్ళాడేసుకుని తన ఇంటికి వస్తాడు. అతను వచ్చి వరండాలో నిలబడి ఉన్నాడని తెలిసినా తను ఓ అయిదు నిముషాల సేపు అలాగే కూర్చుని, ఆ తరువాత నింపాదిగా లేచి బయటకి వస్తాడు. సుందర్రావును అప్పుడే చూసినట్టు నటించి "అరె.... సుందరం నువ్వా? ఎంత సేపయింది వచ్చి? కూర్చో...కూర్చో... అంతా కులాసే కదా?" అంటూ కుశల ప్రశ్నలు వేస్తాడు. ఆ తరువాత వంటింటికేసి తిరిగి "ఇదుగో సుభద్రా..., మన సుందరం వచ్చారు. ఓ కప్పు మాంచి స్ట్రాంగ్ కాఫీ పెట్టు... అలాగే తినడానికేమైనా పట్రా!" అని పురమాయిస్తాడు.

తన ఔదార్యం చూసి సుందర్రావు మరింతగా ముడుచుకుపోతాడు. చేతులు నులుముకుంటూ, నవ్వలేక నవ్వుతూ గొంతు తగ్గించి "అబ్బే.... ఇప్పుడవన్నీ ఎందుకులెండి.... ఇంట్లో కాస్త డబ్బుకు ఇబ్బందిగా ఉంది.. పెద్దబ్బాయి ఫీజు కట్టాలి... అందుకని...." అంటూ నీళ్ళు నములుతాడు.

అప్పుడు తను ఎంతో నొచ్చుకొని "ఛ! ఛ! మరీ అంత ఇదిగా మాట్లాడకు సుందర్రావు... కష్టాలు అందరికీ వస్తాయి. ఏం చేస్తాం చెప్పు.... అయినా ఇలాంటి అవసరాల కోసమే నేను కొంత డబ్బు దాచి వుంచుతాను ఎప్పుడూ, అందులోంచే సీకిస్తాలే. మరేం వర్రీ అవకు" అంటూ లోపలికి వెళ్ళి తను డబ్బు తెచ్చి ఇస్తాడు.

సుందర్రావుకు కృతజ్ఞతతో కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి

జేబులోంచి రుమాలు తీసి కళ్ళు తుడుచుకుని, తన చేతులు రెండూ పట్టుకుని "థ్యాంక్యూ గుర్నాథం... అసలు నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. నిజంగా నీలాంటి స్నేహితుడుండడం నా అదృష్టం" అని ఎన్నో విధాలుగా తనను పొగిడేస్తాడు.

తను ఆ ఆదను వదలకుండా "చూడు సుందర్రావు... అంటున్నానని మరోలా అనుకోకు. నువ్వు కాస్త నీ దుబారా ఖర్చు ఇకనైనా తగ్గించుకోవాలోయ్. ముందే నువ్వు కొంచెం జాగ్రత్త పడి నాలుగు డబ్బులు వెనకేసుకుని వుంటే ఇప్పుడీ అవస్థ ఉండేది కాదుగా! అయినా భార్య ఎంత అందంగా వుంటే మాత్రం, ఆమెపై నీకెంత ప్రేమ వుంటే మాత్రం- ఇలా ఆమె చెప్పినట్లల్లా వినడం ఏం బాగుంది చెప్పు. భర్తగా నీ మాట కూడా కాస్త చెల్లేలా చూసుకోకూడదూ?" అంటూ మెత్త మెత్తగా నాలుగు చీవాట్లు పెడతాడు.

సుందర్రావు మరింత కుంగిపోయి "నన్నింకా ఎందుకు సిగ్గుపడేలా చేస్తావు గుర్నాథం?" అసలు దాని మాట వినేగా నేనీ స్థితికి వచ్చింది? ఇక నుంచైనా జాగ్రత్తగా ఉంటాలే!" అంటాడు.

అప్పుడు తను అతని భుజం తట్టి "ఓరి పిచ్చివాడా ఈ మాత్రానికే ఇంతలా బాధపడాలా? ఏదో అప్పుడు పొరపాటు జరిగిపోయింది అంతేగా? అయినా మనుషులన్న తరువాత పొరపాట్లు అందరికీ సహజమేగా?" అని ఓదారుస్తాడు.

ఇక సెలవు తీసుకుని సుందర్రావు బయలుదేరబోతుంటే తను మళ్ళీ అతన్ని వెనక్కి పిలిచి "అవునూ.... ఇంతకీ ఉద్యోగం ఏదన్నా దొరికిందా?" అని అడుగుతాడు గుర్నాథం, పెద్ద మనిషి తరహాలో.

సుందర్రావు తల వంచుకుని సిగ్గుపడుతూ "ఇంకా లేదు గుర్నాథం... ఎక్కడా దొరక లేదు" అని వాపోతాడు.

"ఇదుగో సుందర్రావు... పరిస్థితి ఇంతవరకు వచ్చిన తరువాత ఇక దర్జాలు మానుకోక తప్పదు. జీతం 'వేయి కావాలి రెండు వేలు కావాలి' అని పట్టుబడకుండా నువ్వు దేనిలోనో దూరిపోతే మంచిది" అంటూ హితవు చెబుతాడు.

"ఇంకా అలా అంటానా గుర్నాథం? ఎంత తక్కువైనా సరే, ఏదో ఒక ఉద్యోగం అంటూ దొరికితే చాలు" అని దీనంగా పలుకుతుంది సుందర్రావు గొంతు.

"అయితే ఓ పని చెయ్. నా ఫ్రెండు కృష్ణమూర్తి అని ఓ పెద్ద ఆఫీసరున్నాడులే .. అతన్తో చెబితే నీకు తప్పకుండా ఏదైనా ఉద్యోగం ఇస్తాడు. నా మాటంటే అతనికి చాలా గౌరవం."

ఈ మాట వినేసరికి సుందర్రావు గొంతు ఆర్ద్రమైపోయి అతనికి నోట మాట పెగలదు. తన రెండు చేతులూ అంది పుచ్చుకుని వాటిని కళ్ళ కద్దుకుంటాడు.

తను అతనికి ధైర్యం చెప్పి, చెయ్యి పట్టుకుని తలుపు దాకా వచ్చి సాగనంపుతాడు.

ఇతరుల మాటలు దొంగచాటుగా వినే అలవాటున్న చలపతి



ఈ మాటలన్నీ వినేసి ఆ పేట పేటంతా చాటేస్తాడు. ఏమని? గుర్నాథం సుందర్రావుకి ఉద్యోగం ఇప్పించాడనీ, డబ్బు సాయం చేశాడనీ. దాంతో తనకు బోలెడంత పరపతీ పెరిగిపోతుంది. ప్రతివాళ్ళూ తనను ఎంతో గౌరవంగా చూస్తూ ఆ పనికీ, ఈ పనికీ తన దగ్గరకు రావడం ప్రారంభిస్తారు.

తను అన్న మాట ప్రకారం సుందర్రావుకు ఓ మూడొందల రూపాయల ఉద్యోగం ఇప్పిస్తాడు. అతను దాంతోనే ఎలాగో సరిపుచ్చుకుంటూ కాపురం చేస్తుంటాడు.

కొన్నాళ్ళకు తన దగ్గర తీసుకున్న డబ్బును తెచ్చి అతను తనకిస్తాడు. ఓ చేత్తో దాన్ని అందుకుంటూనే "అప్పే.... ఇప్పుడు ఏమంత తొందరొచ్చింది? అయినా ఈ కాస్త డబ్బు తిరిగివ్వక పోతే [illegible]ము. నీ దగ్గరే ఉంచు" అని ఔదార్యం చూపిస్తాడు తను.

[illegible] ఎవర్నీ లక్ష్యపెట్టని సుందర్రావు భార్య కూడా అప్పటినుంచీ తనతో ఎంతో వినయంగా విధేయతతో మాట్లాడుతుంది. తన పట్ల కృతజ్ఞత చూపుతుంది....

గుర్నాథం మనసులో ఇలాంటి ఊహలు చక్కగా అల్లుకుపోతున్నాయి.

కాని అవన్నీ అతని ఊహలు మాత్రమే. నిజాలు కావు. ఎందుకంటే సుందర్రావుకి ఉద్యోగం ఊడినా వెంటనే డబ్బు కోసం ఎవర్నో దేబిరించాల్సిన అవసరం అతనికి లేదు. గుర్నాథమే సుందర్రావు దగ్గరికి వెళ్ళి బతిమాలుకుంటే జాలి తలచి రెండు మూడు ట్యూషన్లు కుదిర్చిపెట్టాడే గానీ గుర్నాథం దగ్గరికి వచ్చి ఉద్యోగం కోసం బతిమిలాడాల్సిన కర్మ అతనికి పట్టలేదు.

అందుకే కాబోలు అతని మనసు తనను అధికుడిగానూ, సుందర్రావును మరీ హీనంగానూ చిత్రిస్తూ ఏవేవో ఊహల్లో మునిగిపోయింది. అలా ఊహించుకోవడంలో అతనికి చాలా సంతోషంగానూ, తృప్తిగానూ అనిపించసాగింది. ఎందుకంటే సుందర్రావుపై అదో రకమైన అసూయ అతనికి. "అతనంత అనుకూలంగా తను లేనే... అతనికున్నంత అందమైన భార్య తనకు లేదే!" అన్న దుగ్ధ గుర్నాథం మనసులో ఎప్పట్నుంచో ఉంది. ఇప్పుడు అతనికి ఉద్యోగం పోయిందని తెలియగానే అవన్నీ పైకిలేచి ఈ విధంగా ఊహలతో అతని మనసును సంతృప్తి పరుస్తున్నాయి.

వీపుమీద గట్టిగా దెబ్బ పడేసరికి ఉలిక్కిపడ్డాడు గుర్నాథం.

"గుర్నాథం....లే ఇంటికెళదాం" అన్న చలపతికి మాట విని చటుక్కున అతనికి పరిసరాలు గుర్తుకొచ్చాయి. తను హోటల్లో కొచ్చి చాలా సేపయిందని పించింది వెంటనే కాఫీ తెప్పించుకుని తాగి బిల్లు చెల్లించి బయటపడ్డాడు. చలపతితో కలిసి తిన్నగా ఇంటి దారి పట్టాడు.

ఇంటికి వచ్చిన గుర్నాథాన్ని చూసి ఇంట్లో అతని భార్యా పిల్లలూ చాలా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే వాళ్ళు అతని నవ్వు మొహం చూసి చాలా కాలమైంది. ఎప్పుడూ అతని మొహం, కోపంతో చిరాకుతో చిటపటలాడుతూఉండే తప్ప పొరపాటుగానైనా

అతని మొహంలో నవ్వు కనిపించదు.

తండ్రిని చూడగానే పెద్దపులిని చూసినట్టు ఎక్కడ వాళ్ళక్కడ తప్పుకునే పిల్లలు ఆరోజు అతని ధోరణి కనిపెట్టి ధైర్యంగా అతనిముందే ఆడుకోసాగారు.

గుర్నాధం భార్యను పిలిచి దగ్గర కూర్చో పెట్టుకుని మరీ కబుర్లు చెప్పసాగాడు. ఆమె ఆ మంచి అవకాశాన్ని జారవిడవ కుండా "ఏమండీ..."మయూరి" సినిమా చాలా బాసుందిటండీ.... మనం కూడా వెళదామండీ .."అని తన మనసులోని కోరికను మెల్లగా బయట పెట్టింది.

"అలాగే వెళ్దాంలే....దానికేం భాగ్యం.... రేపు ఆదివారం ఆ సుదంరావు లాగా ఇంటిముందుకు ఆటోతెప్పించుకుని మరీవెళదాం" అన్నాడు ఏదో లోకంలో తేలిపోతున్న గుర్నాధం.

ఆమెతన చెవులను తానే నమ్మలేకపోయింది. ఎందుకంటే గుర్నాధానికి సినిమాలంటే అసలు పడదు. "అదో దుబారా ఖర్చు" అంటాడు "సినిమాకి వెళదాం" అని భార్య అడిగి నప్పుడల్లా. అలాంటిది ఈరోజు ఇంత ఉదారంగా ఒప్పేసుకున్నాడేమిటా అని ఆమెకు ఒకటే ఆశ్చర్యం.

ఆరాత్రి వాళ్ళకు చాలా సంతోషంగా గడిచిపోయింది.

మర్నాడు గుర్నాధం లేవగానే మళ్ళీ అతనికి సుందరరావు గుర్తుకొచ్చాడు. అంతలో ఎవరో ఇంటి తలుపు తడితే వెళ్ళి తలుపు తీశాడు గుర్నాధం. ఓ కుర్రాడు "ఇది సుందరరావు పంపించారు" అని ఓ స్వీట్‌బాక్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ స్వీట్ బాక్సును చూడగానే గుర్నాధం మొహం అదోలా అయిపోయింది. పిల్లలందరూ ఒక్కసారిగా ఎగబడి దాని మూతను తీయబోతుంటే కోపంతో ఒక్క కసురు కసిరాడు "అయితే సుందరరావు తను ఊహించినంత కష్టాల్లో లేడన్న మాట!" అనుకుని ఆ బాక్సును తనే తీశాడు. అందులో ఉన్న రకరకాల స్వీట్సును చూడగానే నోరూరి ఓ ముక్క తీసి నోట్లో వేసుకున్నాడు.

అంతలో అక్కడికి భార్య రావడంతో గబగబా మూతి తుడుచుకుని "చూశావా సుందరరావు చేస్తున్న దుబారా ఖర్చు. ఉద్యోగం ఊడినా ఇంకా దర్జాలుమాత్రం మానలేదు" అన్నాడు అతని స్థితికి జాలిపడుతున్నట్టు.

ఆమె మొహంలో అయిష్టత చోటుచేసుకుంది. "అబ్బ! ఎందుకండీ అస్తమానం ఆయన్ని ఆడిపోసుకుంటారు. వాళ్ళకేం తక్కువని? ఏదో కారణంచేత ఉద్యోగం మానేసి వుంటాడుగానీ వాళ్ళకేం లేదాపోదా చెప్పండి?" అని ఇంకా ఏదో చెప్పబోయింది ఆమె. మధ్యలోనే కసురుకున్నాడు గుర్నాధం. "చాల్లే తెలిసీ తెలియని విషయాల్లో తగుదునమ్మా అని రాక నోరుమూసుక్కూర్చో. ఎన్నో కుటుంబాలు ఇలా దర్జాలకుపోయి చివరికి మట్టిలో కలిసిపోవడం ఈ కళ్ళతోనే చూశాను" అన్నాడు.

"ఛీ! ఎప్పుడూ పాడు ఆలోచనలూ, పాడు మాటలు తప్ప ఒక్క మంచి మాటలేదు" అని తనలో తానే గొణుక్కుంది ఆమె.



ఇంతకీ సుందరరావు స్వీట్‌బాక్స్ ఎందుకుపంపాడో గుర్నాధానికి అర్థం కాలేదు. సుందరరావు బర్త్‌డే నేమోననుకున్నాడు. బర్త్‌డే అయినంత మాత్రాన ప్రతీ ఇంటికీ స్వీట్‌బాక్స్ పంపి తన దర్జా చూపించుకోవాలనా? ఉద్యోగం ఊడినా తన దర్జాకేమీ లోటు లేదు "అక్కడా ఇక్కడా అప్పుచేసి బర్త్‌డే జరుపుకుంటున్నాడేమో" అనుకున్నాడు గుర్నాధం.

రెండు రోజులు గడిచిపోయాయి. ఆదివారం కూడా రానే వచ్చింది. కానీ సుందరరావు గురించిన వార్తలేవీ తెలియలేదు గుర్నాధానికి, కనీసం చలపతి అయినా వచ్చి, పీపు చిరిచి ఏదైనా వార్త చెవిన పడేసాడేమో అని ఎదురుచూశాడు. కానీ అతనూ రాక పోయేసరికి ఇక ప్రాణం ఉండబట్టలేదు. "ఏమయితే అయింది. తిన్నగా సుందరరావు దగ్గరికె వెళ్ళి విషయం కదిపితే సరి" అన్న నిర్ణయానికొచ్చిన గుర్నాధం వెంటనే సుందరరావు ఇంటికి బయలుదేరాడు.

వాళ్ళ ఇల్లు సమీపించగానే మొహం మీది వెకిలినవ్వు చెరిపేసుకుని విచారం పులుముకున్నాడు.

వరండాలో తీరిగ్గా కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్న సుందరరావు గుర్నాధాన్ని చూడగానే అప్రయత్నంగా నొసలు చిట్లించాడు.

గుర్నాధం గుమ్మంలోకి వచ్చీ రాగానే "ఏమిటీ ఈరోజు గుర్నాధంగారి దృష్టి ఇటు మళ్ళినట్టుందే? ఏదైనా ప్రైవేటు చేజారి పోయిందా? లేక ఇంకా మధ్యలో ఏమైనా బాకీ మిగిలిందా?" అని అడిగాడు వ్యంగ్యంగా.

ఆ మాటకు గుర్నాధం కాస్త కంగుతిన్నాడు.

ఈ సారి సుందరరావు ఇంటికి వెళ్ళినప్పుడు తనదే పైచేయిగా ఉంటుంది. సుందరరావు దీనంగా ఉంటాడు. ఆ ధైర్యం చూసి లోలోపల సంతోషం కలిగినా పైకి మాత్రం కనబరుస్తూ సానుభూతిగా మాట్లాడవచ్చు" అనుకుంటూ వచ్చిన గుర్నాధం తీరా అక్కడికి వెళ్ళాక పరిస్థితి ఎదురు తిరగడం చూసి కొంచెం తికమక పడ్డాడు.

అయినా వెంటనే తమాయించుకుని "ఛ! ప్రైవేట్ల కోసం నేను రాలేదు బాబూ.... అయినా వాటికోసం అంతగా పాకులాడే వాణ్నికాను" అన్నాడు గుర్నాధం గర్వంగా.

"ఓహో... అందుకే క్రితం మొన్న మా హేమని క్లాసులో అందరి ముందూ అవమానించి, దండించి ఆ తరువాత ఆమె చేత ఓ ఉత్తరం పంపారు? ఆమె తల్లిదండ్రులను వచ్చి కలవమని అందులో రాశారు?" అన్నాడు సుందరరావు వ్యంగ్యంగా.

గుర్నాధం గతుక్కుమన్నాడు. "ఆ హేమకి, వీడికి ఏమిటి సంబంధం?" అని మనసులోనే ఓ క్షణకాలం ఆలోచించి తరువాత "అద్వే...నేనలా ఎప్పుడన్నాను? అయినా టెస్టులో అన్నీ తప్పులు రాస్తే నేను ఎవర్నయినా సరే అలాగే మందలిస్తాను" అన్నాడు సమర్థించుకుంటూ.

అంతలో హేమ ఇంటిలోపలి నుంచి ఇవతలికి వచ్చి గుర్నా

షం చేసిన అన్నమాటలన్నీ యథాతథంగా సుందర్రావుతో చెప్పి తన నోట్‌బుక్ చూడు బాబాయ్ ఈయన రాయించిన నోట్సిది. ఇందులో ఉన్న సమాధానాలే రాశాను." అంది.

గుర్నాధానికి వెంటనే ఏం చెప్పాలో తోచలేదు కాసేపు ఆలోచించి ఆ తరువాత తనను తాను సమర్థించుకుంటూ "ఏదో పొరపాటు జరిగి వుంటుంది. నేను రాయించిన ఈ కరెక్ట్ సమాధానాలే టెస్టులో రాస్తే నేనెందుకు నిన్ను దండిస్తాను? చదువులో కాస్త వెనకబడి వున్నానని హెచ్చరించడం కూడా తప్పేనా?" అన్నాడు.

సుందర్రావు కల్పించుకుని "హేమ మా అన్నయ్య కూతురు. మంచి తెలివైన అమ్మాయి. ఈ చదువులో వెనకబడడమేమిటి నా మొహం? నువ్వే నీ అల్ప బుద్ధి చూపించుకోడానికి ఆమెనలా అవమానించి వుంటావు అంతే. అయినా ఆమె తన గురువు గారికి తన భక్తిదే కానుక పంపడం మరిచిపోలేదు. మొన్న మీకు స్వీట్ బాక్సు పంపింది ఎవరనుకున్నారు? మా హేమ, గురువు గారిపై భక్తి ఉండబట్టే అని పంపింది. అన్నాడు

గుర్నాధానికి తల కొట్టేసినట్టయింది. ఎంత అన్నయ్య కూతురయితే మాత్రం తన శిష్యురాలి ముందు ఇంత అవమానం చేస్తాడా?" అని సుందర్రావు మీద చెప్పలేనంత కోపం వచ్చింది. అయినా కోపం దిగమింగుకుని ఆ టాపిక్ మార్చేసి అవునూ.... మీరు ఈ మధ్య ఆఫీసుకు వెళ్ళడం లేదనో.... సెలవు పెట్టారనో విన్నాను! నిజమేనా? అని అడిగాడు ఎక్కడలేని ఆప్యాయతని ఒలకబోస్తూ.

సుందర్రావు కూడా మామూలుగా అయిపోయి నవ్వుతూ సమాధానం చెప్పాడు. "అవును నిజమే నేను ఆఫీసుకు వెళ్ళడం లేదు. ఉద్యోగం మానేశాను."

గుర్నాధం ఎక్కడలేని ఆశ్చర్యం నటిస్తూ "అరె... ఉద్యోగం మానేశావా? ఎందుకండీ.... పదిహేను వందలు వచ్చేదిగా ఇప్పుడు ఇంకో ఉద్యోగం దొరకాలంటే మాటలా?" అన్నాడు తన మాటలో సానుభూతిని కూడా తగు పాళ్ళల్లో కలపడం మాత్రం మరవలేదు.

సుందర్రావు పెద్దగా నవ్వి "ఇంకో ఉద్యోగం దొరికిందిలే.. నువ్వేం వర్రీ అవకు పాపం!" అన్నాడు ఎగతాళిగా—అతని స్వభావం తెలుసు కాబట్టి.

అప్పటికీ గుర్నాధానికి కుతూహలం తగ్గలేదు. "జీతం ఎంతుంటుందో?" అని అడిగాడు,

"ఆ....ఎంతో లేదులే.... రెండువేలు అంతే!"

"ఆ...." అంటూ షాక్ తిన్నట్టు అలా ఉండిపోయాడు ఒక్క క్షణం గుర్నాధం.

తాననుకున్నదంతా తలకిందులయ్యే సరికి ఇక ఒక్క క్షణం కూడా అక్కడుండ లేకపోయాడు గుర్నాధం. ఓర్వలేని తనంతో ఉడుక్కుంటూ చరచరా బయటికి వచ్చేశాడు.

గుర్నాధం ఇంటికి రాగానే అతనికి భోజనం వడ్డించింది అతని భార్య. వెంటనే రుసరుసలాడుతూ భోజనంచేయసాగాడు.

భర్త మనసులో జరుగుతున్న సంఘర్షణ సంగతి తెలియక ఆమె "ఆదివారం సినిమాకెళ్దాం అన్నారుకదండీ....పిల్లలూ, నేనూ ఎప్పుడో తయారయిపోయాం. మీరు భోంచేసి తయారయితే...." అని సినిమా సంగతి గుర్తుచేసింది.

అంతే... అంతసేపూ లోలోపలే పొగరాజుకుంటున్న గుర్నాధం కోపాగ్ని ఇప్పుడు ఒక్కసారిగా భగ్గుమంది.

"నీ మొహానికి సినిమా ఒకటా? ఊరికే నోరుమూసుకుని ఇంట్లో పడుండు. అయినా ఇంతమందిని సినిమాకు తీసికెళ్ళడానికి ఇక్కడ నేనేం డబ్బులు కుప్పబోసుక్కూర్చున్నానా?" అంటూ విరుచుకుపడ్డాడు.

ఆమె తెల్లబోయింది. "రెండు రోజుల ముందు నవ్వుతూ ఎంతో సంతోషంగా" సినిమాకి ఆదివారం వెడదాంలే.... అదీ సుందర్రావు వాళ్ళలా ఇంటికి ఆటో తెప్పించుకుని మరీ వెళదాం అన్న మనిషేనా ఇప్పుడిలా కోపంతో కస్సుబుస్సు మంటున్నది?" అని ఆశ్చర్యంతో భర్త వంక చూస్తూ ఉండిపోయింది. "ఇలాంటి మనిషితో ఇన్నేళ్ళబట్టీ ఎలా వేగుతున్నానా? ఒక్కనాడైనా ఓ మంచి మాటలేదు. ఓ ముద్దూ ముచ్చటాలేదు. అనుకుంటూ మౌనంగా ఉండిపోయింది ఆమె.

గుర్నాధం భోంచేసి ఇవతలకి వచ్చాడు. వాలు కుర్చీలో కూర్చుని తీరిగ్గా సిగరెట్టు ముట్టించుకునేలోగా చలపతి పళ్ళికిలిస్తూ హాజరయ్యాడు.

"అవునూ... సుందర్రావింటికి వెళ్ళారటగా.... ఏమిటి సంగతి?" కుతూహలంగా అడిగాడు.

అక్కడ జరిగింది తల్చుకుంటే ఇప్పటికీ కడుపులో చిచ్చు రేగుతుంది గుర్నాధానికి.

అయినా పైకి మాత్రం మామూలుగా నవ్వుతూ. "సంగతికేముంది మామూలే. ఏమిటో ఆ ఉద్యోగం నచ్చక మానేశాను. ఇప్పుడు మానేసిన తరువాత తెలుస్తోంది దాని విలువ అని వాపోయాడు పాపం. ఎక్కడైనా ఓ ఉద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాడు. "అలాగే ఇప్పిస్తాలే. నువ్వేం బెంగపెట్టుకోకు" అనిధైర్యం చెప్పాను. డబ్బుకు మహా ఇబ్బందిగా ఉందట.

ఓ వేయిరూపాయలు ఎలాగైనా సర్దండీ.... అని కాళ్ళావేళ్ళా పడ్డాడు. అలాగే సర్దుతాలే దానికేంభాగ్యం! అని చెప్పొచ్చా. స్నేహితులన్న తరువాత ఆ మాత్రం సహాయం చేయకపోతే ఎలా చెప్పు? అని గర్వంగా గొప్పలు చెప్పుకుపోతున్న భర్తవంక కిటికీ లోంచి అసహ్యంగా చూసింది గుర్నాధం భార్య.

చలపతి మాత్రం గుర్నాధం వీపుమీద ఒక్కసారి గట్టిగా చరిచి "మంచి మాటన్నావ్ గుర్నాధం స్నేహితుడంటే నీలా ఉండాలి. అందరూ ఉన్నారు ఎందుకూ?" అని మెచ్చుకున్నాడు. ఆమెచ్చుకోలులో వ్యంగ్యం దాగివుంది. నీ సంగతి నాకు తెలీదా? అన్న భావం కూడా ఉంది.

ఇదండీ గుర్నాధం కథ మీరు ఎందుకు జాగ్రత్తగా

ఉండాలో ఇప్పుడైనా అర్థమైందా? గుర్నాధమేకాదు గుర్నాధం లాంటి వాళ్ళు బో‿డుమంది ఉన్నారు ఈ ప్రపంచంలో కాబట్టి జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ అలాంటివాళ్ళు తారసపడినా సుందరరావులా ఎదురు దెబ్బతీయడానికి తగిన ప్లాన్ వేసుకుని సిద్ధంగా ఉండం‿. అలాంటివారికి అదే తగిన శాస్తి ఏమంటారు?

(ఈకథ గుర్నాధం పేరుగల వాళ్ళెవరికీ అన్వయించదని మనవి చేసుకుంటున్నాను-రచయిత

